

నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు లాటరీ
4లో.. సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ
పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త
ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

రేషన్ అక్రమ రవాణాకు రెడ్ సిగ్నల్



రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వం 'రెడ్' సిగ్నల్ వేసింది. నల్లబజారుకు తరలే పేదల బియ్యాన్ని 'రెడ్'హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రత్యేక పరీక్ష కిట్లను పౌరసరఫరాల శాఖకు అందజేసింది. జిల్లాల వారీగా వీటిని పంపిణీ చేసింది. అక్రమార్కులపై అక్కడికక్కడే 6ఏ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాధా రణ బియ్యం మాటున జరిగే.. చౌక బియ్యం అసలు 'రంగు' తేలికగా తేలనుంది.

- స్పాట్‌లోనే పేదల బియ్యం గుర్తింపు
- పరీక్షలకు పౌరసరఫరాల శాఖకు ప్రత్యేక కిట్లు
- జిల్లాలకు ఇప్పటికే పంపించిన ప్రభుత్వం
- నల్లబజారు వ్యాపారులకు ఇక 'రంగు' పడనుంది..!



పీడీఎస్ బియ్యం నిర్ధారించే కిట్

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పేదలకు బలవర్థక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ బియ్యం అంటారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే చౌక బియ్యాన్ని.. అక్రమార్కులు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బియ్యం నిల్వలు పట్టుబడినా.. అక్కడికక్కడే వాటిని నిర్ధారించే పరిస్థితి గతంలో లేదు. కానీ, ఇక నుంచి లెక్క వేరేలా ఉండనుంది. నల్లబజారులో పేదల బియ్యాన్ని స్పాట్‌లోనే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు. ఇందుకు ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్‌లను జిల్లాకు 7 నుంచి 10 వరకు ప్రభుత్వం అందజేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని నిర్ధారించడమే కాకుండా వెనువెంటనే 6ఏ కేసు నమోదుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కిట్లు కాకినాడ పోర్టులో ఉండేవి. పోర్టుకు వచ్చే బియ్యం నిల్వలను కిట్ ద్వారా పరీక్షించే వారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గానికి పరీక్ష విధానాన్ని తీసుకొచ్చారు.

బియ్యం ఫోర్టిఫైడ్ ఇలా..

మార్కెట్‌లో సాధారణ బియ్యానికి.. ప్రభుత్వం అందించే చౌక బియ్యానికి చాలానే తేడా ఉంది. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని ఫోర్టిఫైడ్ చేసి.. పేదలకు సరఫరా చేస్తోంది. ఈ బియ్యంలో పోషకాలు ఉంటాయి. ఇందులో కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలుపుతారు. ముందుగా బియ్యాన్ని పిండిగా మారుస్తారు. అందులో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. అనంతరం ఆ పిండిని మళ్లీ బియ్యం కెర్నెల్స్(గింజలు)గా మార్చుతారు. క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలుపుతారు. ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార లోపం కూడా ఉండకూడదన్న లక్ష్యంతో అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ప్రజా పంపిణీలో ఈ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతేడాది నుంచి ఈ విధానం పూర్తి స్థాయిలో (మిగతా 4వ పేజీలో)

ఎస్సీలకు రుణాలు

- జిల్లాల వారీగా లక్ష్యాల నిర్దేశం
- రాయితీపై యూనిట్లకు కార్యాచరణ
- కార్పొరేషన్‌ను గాడిన పెట్టే దిశగా ప్రభుత్వం



2852 యూనిట్లు.. రూ.38 కోట్ల రాయితీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే యూనిట్లకు సంబంధించి జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. బాపట్ల జిల్లాలో వివిధ కేటగిరీల్లో 912 యూనిట్లు కేటాయించగా ఇప్పటికే 2,500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో 990, పల్నాడు జిల్లాలో 950 యూనిట్లకు దర ఖాస్తులు ఆహ్వానించగా దాదాపు 5,000 వరకు వచ్చాయి. మూడు జిల్లాలకు ప్రభుత్వం కేటాయించిన రుణాలు రూ.95 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో రాయితీ రూ.38 కోట్లు, బ్యాంకులు అందించే రుణ సదుపాయం రూ.45 కోట్ల వరకు ఉండనుంది.

(పొన్నూరు , ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం కల్పించేలా ప్రస్తుత ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన ఎస్సీ యువతకు రాయితీపై రుణాలు అందించడానికి కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రాయితీపై అందించే యూనిట్లకు లక్ష్యం నిర్దేశించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఎస్సీ కార్పొ రేషన్ ద్వారా రాయితీ అందించి యూ నిట్లు పెట్టేలా ప్రోత్సహించేది. దాదా పు ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రాయితీపై యూనిట్లు అందించే కార్యక్రమానికి కసరత్తు జరుగుతుండడంపై ఎస్సీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల కంటే ఇప్పటికే మూడు రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో త్వరలోనే మండలాల వారీగా వాటి పరిశీలన ప్రక్రియకి ఎస్సీ కార్పొరేషన్ కసరత్తు చేస్తోంది. మండల స్థాయి అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత అవి కలెక్టర్ లాగిన్‌కు చేరడం, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి నివేదిక తర్వాత లబ్ధిదారుల తుది ప్రకటన వెలువడనున్నది.

మూడు కేటగిరీలు..

ఎస్సీ యువతకు రాయితీపై అందించే రుణాలను మూడు కేట గిరీల్లో విభజించనున్నారు. మొదటి విభాగంలో మూడు లక్షల్లోపు, రెండో కేటగిరీలో మూడు నుంచి ఐదు లక్షల్లోపు, మూడో విభాగంలో పది లక్షల్లోపు యూనిట్లను అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా కేటగిరీల్లో ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న దానిపై తర్జనభర్జన జరుగుతున్నట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్ అందించిన వివరాల ప్రకారం సాంకేతికపరమైన యూనిట్లకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందులో ఐటీ సేవలు మొదలు వెబ్‌సైట్ రూపకల్పన వరకు ఉన్నాయి. సెల్‌ఫోన్ రిపేర్ షాపులు, స్టేషనరి తయారీ, సోప్స్‌తో పాటు సౌందర్య సాధనాల తయారీ యూనిట్లకు రాయితీలో చోటు కల్పించనున్నారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు జవసత్వాలు అందించడంతో పాటు గతంలో లబ్ధి పొందిన వారు బకాయిలు చెల్లించడంలో ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.36 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో బాపట్ల జిల్లా వాటా రూ.8 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కే ఎఫ్‌డీసీకి సంబంధించిన రుణాలు ఈ బకాయిల్లో ఉన్నాయి. బకాయి దారులకు గతంలోనే ఓసారి నోటీసులివ్వడం జరిగిందని, ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.





చీపుర్లు పట్టి పారిశుధ్య పనులు చేస్తున్న కలెక్టర్, మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే

స్వచ్ఛత.. ప్రతిఒక్కరి బాధ్యత

- స్వచ్ఛతా హీ సేవలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమంగా భావించి ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను బాధ్యతగా పాటించాలని, అప్పుడే జిల్లా, గుంటూరు నగరం క్లీన్ అండ్‌గ్రీన్‌గా మారుతాయని కలెక్టర్ తమీమ్‌అన్సారియా తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం రెడ్ ట్యాంక్ కాంప్లెక్స్‌లో 'ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్'లో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు అధిక ప్రాధ్యానం ఇవ్వాలన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉంటేనే క్లీన్‌గ్రీన్ గుంటూరు సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజిల తదితరులు పాల్గొన్నారు.





డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు నసీర్, గల్లా మాధవి

రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం

- డీఎస్సీ నియామకపత్రాల పంపిణీలో ఎమ్మెల్యేలు, ఏపీటీఎస్ చైర్మన్



ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం మొదలైందని గుంటూరు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాల అందజేత మహోత్సవంలో వారు పాల్గొని ప్రసంగించారు. నిరుద్యోగుల కలలను సాకారం చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. గతంలో ఎన్న డూ లేని విధంగా 5.3 లక్షల మంది మెగా డీఎస్సీకి హాజరు కాగా ఎన్ని ఆటంకాలు సృష్టించినా 150 రోజుల్లో రికార్డు స్థాయి లో పరీక్ష నిర్వహించి నియామకాలు చేపట్టామన్నారు. సంవ త్సరంలోనే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చా మన్నారు. పండుగ వాతావరణంలో అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామకపత్రాలు అందజేయడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

మూడో లైన్‌పైనా.. రయ్‌రయ్

- నిడుబ్రోలు - అప్పికట్ల పట్టాలపై స్పీడ్‌టెస్టు

తెనాలి అర్బన్, దుగ్గిరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-గుంటూరు మార్గంలో నిర్మించిన మూడో రైల్వేలైనులో గురువారం కమిషనర్ ఆఫ్ రైల్వేసేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్ట్‌రన్ నిర్వహించారు. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండా రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తేల్చారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేశారు.



దుగ్గిరాల స్టేషన్‌లో మూడోరైల్వేలైన్‌ను పరిశీలిస్తున్న చీఫ్‌సెక్యూరిటీ అధికారి మాధురి, డీఆర్ఎం మోహిత్ తదితరులు



ట్రాక్‌పై ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

మూడో లైను పటిష్ఠంగా ఉందని రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి చెప్పారు. ప్రాజెక్టు మేనేజర్ శేఖర్‌సాహు, ఇంజనీరింగ్ అధికారుల బృందం ఈ లైనును పరిశీలించింది. పెదవడ్లపూడి నుంచి చుండూరు వరకు స్పీడ్ టెస్టు నిర్వహించారు. రైలు వేగంగా వెళ్లేటప్పుడు స్థిరత్వం, ట్రాక్‌లో కదలికలు, బ్రిడ్జి, సిగ్నల్స్, ఎలక్ట్రిఫికేషన్, ప్రయాణికుల భద్రత తదితర అంశాలను పరిశీలించారు. 140 కి.మీ వేగంతో స్పీడు టెస్టు చేయగా, ఒకదశలో వేగాన్ని 148 కి.మీ వరకు పెంచినప్పటికి ట్రాక్ పటిష్ఠంగా ఉందని గుర్తించారు. శుక్రవారం నుంచి ట్రాక్‌ను వినియోగంలోకి తేనున్నట్లు చెప్పారు. స్పీడ్ టెస్టులో డీఆర్ఎం మోహిత్‌తో పాటు పలు విభాగాలకు చెందిన రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వచ్చేది మేమే.. వాటా ఇవ్వాలి

- జిన్నర్లతో బయ్యర్ల రాయబేరాలు
- టెండర్లు ఖరారు కాకముందే భేటీలు
- సీసీఐ అధికారుల తీరుపై ఆరోపణలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు తొలి అడుగుపడుతుంది. టెండర్ల ప్రక్రియ ముగియక ముందే బయ్యర్ల రాయభారాలు మొదలయ్యాయి. జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. ఈ సీజన్‌కు సంబంధించి ఈ నెల 27కి టెండర్ల గడువు ముగుస్తుంది. ప్రస్తుతం కొన్ని నిబంధనల మీద జిన్నర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియ సాగుతుండగానే కొందరు బయ్యర్లు ఎక్కువ మిల్లులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మీ మిల్లుకు వచ్చేది నేనే టెండర్ వేసుకోండి.. వచ్చిందాంట్లో ఎంతో కొంత చూద్దాం అంటూ కొందరు బయ్యర్లు రాయబేరాలు మొదలు పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే రీతిలో కొందరు బయ్యర్లు అధిక సంఖ్యలో జిన్నింగ్ మిషన్లు ఇప్పటికే దక్కించుకున్నారని సమాచారం. టెండర్లు ఖరారు కాకుండా ఫలానా మిల్లుకు తానే బయ్యర్‌గా వస్తానని ఎలా చెబుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ఓ బయ్యర్‌కు సంబంధించిన వ్యక్తి అన్ని మిల్లులకు వెళ్లి తామే వస్తామని చెప్పి ఇప్పటికే సుమారు 300 జిన్నింగ్ మిషన్లు కలి గిన మిల్లులను తన కిందకు తెచ్చుకున్నట్లు సమాచారం. సుమారు 10 మంది బయ్యర్లు ఉండగా, ఒక్కరే అన్ని మిషన్లు తన కిందకు తెచ్చుకోవడంపై చర్చ జరుగుతుంది. సాధారణంగా ఏ బయ్యర్ ఏ మిల్లులో కొనుగోలు జరపాలన్న విషయాన్ని తేల్చాల్సింది సీసీఐ అధికారులే. కొందరు బయ్యర్లు ఇప్పటికే బహిరంగంగా మిల్లులు కేటాయించిన విషయం మాట్లాడుతుండటం వెనుక ఎవరు ఉన్నారన్న ప్రశ్న కూడా వస్తోంది.

విద్యారంగం నిర్వీర్యం

- బోధనేతర విధుల్లో ఉపాధ్యాయులు
- నాణ్యమైన విద్యకు విద్యార్థులు దూరం
- రాష్ట్రస్థాయి రణభేరిలో యూటీఎఫ్ నేతలు

గుంటూరు విద్య, సెప్టెంబరు 25 ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఐదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయగా ఈ ప్రభుత్వం కూడా ఇదే బాటలో పయనిస్తోందని యూటీఎఫ్ నేతలు తెలిపారు. గురువారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రణభేరిలో పలువురు నేతలు ప్రసంగించారు. విద్యారంగం, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన



సభలో ప్రసంగిస్తున్న ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ విద్యాసాగర్

జరిగిన సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ బీ గోపిమూర్తి ప్రసంగించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్ణయాల కారణంగా పది లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. సమస్యలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ప్రభుత్వం చర్చించడంలేదని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ బోధనేతర పనులతోనే ఉపాధ్యాయులు కాలం వెళ్లదీస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం లేకుండా పోతుందని వాపోయారు నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పరీక్షల విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కే సురేష్‌కుమార్, కుసుమకుమారి, గౌరవాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏ విద్యాసాగర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుదాస్, ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు.. ఇద్దరి మృతి

- స్విమ్స్ వైద్యుడు, ఆయన కుమార్తె దుర్మరణం.. మరో ఐదుగురికి గాయాలు
- తిరుపతి నుంచి గుంటూరు వస్తుండగా తాతపూడి వద్ద ఘటన



వెంకటకిశోర్



అశ్వి నందన

చిలకలూరిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదంలో తండ్రి కుమార్తె మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. జాతీయ రహదారిపై చిలకలూరిపేటకు సమీపంలోని తాతపూడి వద్ద గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన చోటుచేసుకుంది. చిలక లూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో అసోసియేట్ ప్రొఫెసరైన డాక్టర్ తంగెళ్ల కేదర వెంకటకిశోర్(42) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరుపతి నుంచి స్వస్థలమైన గుంటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో తెల్లవారు జామున మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. డ్రైవింగ్ చేస్తున్న డాక్టర్ కిశోర్ కారులో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కుమార్తె అశ్వినందనను గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ కిశోర్ భార్య డాక్టర్ అన్నా సంధ్యయాదవ్, కుమారుడు ఆయుష్‌నందన, కిశోర్‌కు వరసకు చెల్లెలు అయ్యే డాక్టర్ శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా ఆధ్యా, అన్నా షైరా గా యపడగా వీరు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆ స్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చిలకలూరిపేట ప్రభు త్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం డాక్టర్ కిశోర్, అశ్వినందన మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించారు. రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పల్లా


కాగా ప్రమాదం విషయం తెలిసిన వెంటనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకున్నారు. చిలకలూరిపేటలోని కందిమళ్ళ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం. పల్లాతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై ప్రత్తిపాటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



ప్రమాదానికి గురైన కారు

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,38 360 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కుల కన్నా తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 5722, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు. దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పులిచింతలకు 2,62,741 క్యూసెక్కులు

రెంటచింతల,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ గేట్లకు 12 గేట్లను 4 మీటర్లు, ఒక గేట్‌ను రెండు మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,62,741 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 2,61,450 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.99 మీటర్ల మేర నీరుండగా.. 6.890 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తి జరగడం లేదని తెలిపారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.70 అడుగులు ఉంది. ఇది 303.94 టీఎం సీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9019, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, 22 క్రస్ట్ గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,28,024, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 2,73,116 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,73,116 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



నేడు రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు ఈ-లాటరీ

తుళ్లూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోత): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన మరికొందరు రైతులకు సీఆర్డీఏ రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనుంది. పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం గ్రామ రైతులకు (ప్రత్యామ్నాయ ప్లాట్లు) శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటరులోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ జరగనుంది. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 43 రెసిడెన్షియల్, 41 కమర్షియల్, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. సంబంధిత రైతులు పాల్గొనాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రతి ఒక్కరూ ఎంతగానో సహకరించారు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా


హెనీక్రిస్టీనాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సహకారంతో సమర్థంగా పరిపాలన అందిస్తున్నానని.. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పేర్కొన్నారు. ఆమె పదవి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి ఉద్యోగులు తమవంతు సహకారాన్ని అందించారని హెనీక్రిస్టీనా తెలిపారు. పరిపాలన అధికారి రాజా రత్నబాబు, అకౌంట్ ఆఫీసర్ శామ్యూల్‌పాల్, రామకోటయ్య, తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్ రావు, జిల్లా పరిషత్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ రిప్రజెంటేటివ్ తోట ఉషాదేవి, అరుణ తదితరులు చైర్‌పరన్‌ఉ సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ అక్రమ రవాణాకు 'రెడ్' సిగ్నల్!

(3వ పేజీ తరువాయి)

అమల్లోకి వచ్చింది.

'రెడ్' హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు..!

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నిర్ధారించేందుకు కిట్‌లో రెండు కెమికల్స్ ఉంటాయి. ఫోర్టిఫైడ్ బియ్యపు గింజలపై కెమికల్ చుక్కలు వేయగానే అవి ఎరుపు రంగులోకి మారుతాయి. ఎందుకంటే ఈ ఫోర్టిఫైడ్ గింజల్లో విటమిన్లు కలిసి ఉండటమే. ఇలా రేషన్ బియ్యాన్ని ఇక నుంచి నిర్ధారించవచ్చు. చిన్న బియ్యం ఆకారపు గింజలను ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్(ఎఫ్ఆర్‌కే) అంటారు. ఈ బియ్యం పంపిణీ అమల్లోకి వచ్చిన కొత్తలో చైనా బియ్యం, ప్లాస్టిక్ బియ్యం అంటూ ప్రజలు అపోహలకు గురయ్యారు. ఈ బియ్యపు గింజలు.. నీటిలో తేలాడుతాయని, అందువల్లే వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు భావించారు. ఈ అపోహలను పౌరసరఫరాల శాఖ నివృత్తి చేసింది.

నియోజకవర్గానికి ఒక కిట్..

ప్రతి జిల్లాకు ఈ కిట్లు సరఫరా అయ్యాయి. ఒక కిట్ జిల్లా సరఫరా అధికారి వద్ద ఉంటుంది. పౌర సరఫరాల టీటీలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందజేశారు. కిట్ల సంఖ్య ఇంకా పెరగనుంది. మొత్తం మీద చౌక బియ్యం అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది.

ఒక్క చాన్స్ అడిగారు... నెత్తిన కుంపటి పెట్టారు

● శాంతి భద్రతలు, సోషల్ మీడియా విషప్రచారంపై కఠినంగా ఉండాలి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే ఎవరిపైన అయినా కఠినంగా వ్యవహరిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు కోరారు. గురువారం అసెంబ్లీలో శాంతిభద్రతల అంశంపై ఆయన ప్రస్తావిస్తూ.. 2019లో ఒక్క చాన్స్ అడి గారని, ఇస్తే రాష్ట్ర ప్రజల నెత్తిన కుంపటి పెట్టి పోయారన్నారు. వైసీపీకి అవకాశం ఇస్తే కరెం టు తీగలు పట్టుకున్నట్టేనని ఆనాడు సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.16 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్ర బాబు రాజధాని పర్యటనకు వస్తే చెప్పులు వేశారని, దీనిపై ఆనాటి డీజీపీ వ్యాఖ్యలు చూస్తే భావ ప్రకటన స్వేచ్ఛ అన్నారన్నారు. అలా చే యడం తమకు చేతకాక కాదని, క్రమ శిక్షణ కలిగిన పార్టీలో పనిచే స్తున్న తామంతా.. అలా చేయకూడదన్న ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దిశానిర్దేశంతో ఓపిగ్గా ఉన్నామని యరపతినేని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ మహిళలను గౌరవిస్తూ.. ఎన్నో పథకాలకు మహిళల పేర్లతో ఇస్తున్నామని దీంతో మహి ళల్లో ప్రజాదరణ వచ్చిందన్నారు. మంచి ఆలోచనలు వైసీపీ నాయకులకు లేవన్నారు. సభలో చంద్రబాబు లాంటి మచ్చలేని నాయకులపై, రాజధాని మహిళలు, రైతులపై అసత్య ప్రచారాలు చేయడం తోపాటు అనేక ప్రాంతాల్లో అత్యాచారాలకు పాల్పడిన వైసీపీ నేతలు.. నేడు మహిళల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం అనేకన్నా.. పైశాచిక ప్రభు త్వం అంటే బాగుంటుందేమో నని యరపతి నేని అభిప్రాయపడ్డారు. వైసీపీ నేతలు కొందరు ఇప్పటికీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారానికి పాల్పడుతూ.. మహిళలను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారన్నారు. అలాంటి వారిని తేలికగా తీసుకోవద్దని సభలో యరపతినేని ప్రస్తావించారు. అడ్డగోలుగా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జిల్లా అధికారులు కూడా తగిన ఆదేశాలు ఇస్తూ సోషల్ మీడియాలో మహిళలను కించపరి చేలా పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించే విధంగా ఆదేశా లివ్వాల్సి ఉందన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే యరపతినేని సభలో ప్రస్తావించారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

జీఎస్టీ సంస్కరణలు వినియోగదారులకు అందాలి

● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలను వినియోగదారులకు అందించడం వ్యాపారుల నైతిక బాధ్యత అని 20 సూత్రాల అమలు కమిటీ చైరన్ లంకా దినకర్ అన్నారు. గురువారం జేకేసీ కళాశాల రోడ్డులోని మీటింగ్ హాల్‌లో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. లంకా దినకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడవకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు లాభం చేకూరుతుందో.. లేదో చూడాల్సిన బాధ్యత జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్‌దేనన్నారు. తగ్గిన ధరలకు సంబంధించిన మేలు వినియోగదారులకు అందేవిధంగా విషయ పరిజ్ఞానాన్ని ప్రజలకు చేర్చే ప్రక్రియకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ శ్లాబులు తగ్గించడం వల్ల దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుందన్నారు. ఈ సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జీఎస్టీ సూపరింటెండెంట్ నాగేశ్వరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది రంగరాజు, భీమినేని చంద్రశేఖర్, డాక్టర్ రాధ మాధవి, దర్శనం శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, చార్టెడ్ అకౌంటెంట్స్, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ప్రొఫెసర్లు, ఇంజనీర్స్ తదితరులు పాల్గొన్నారు



సదస్సులో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ లంకా దినకర్

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, తెలుగు పాటలకు చిరునామా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సౌజన్యంతో, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్ సెంటర్, ఐలాండ్ వద్ద ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సభ నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత కాలం బాలు పాట వినపడుతూనే ఉంటుందన్నారు. గాయకులు యశోదకృష్ణ, వెంకటరత్నం, డేగల వెంక టేశ్వరరావు, ఖాదర్, బాబురావు, ఎన్ కోటేశ్వరరావు, కృపావరం, ఉపేందర్‌సింగ్, సత్తార్, మాతృశ్రీ విద్యా సంస్థల డైరెక్టర్ గాంధీ పాల్గొన్నారు.


ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహానికి నివాళులర్పించిన గాయకులు

తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి జాషువా : ఆర్డీ విల్సన్



ప్రసంగిస్తున్న చైర్మన్ ఆర్‌డీ విల్సన్, పాల్గొన్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): తెలుగు నుడికారానికి గుడికట్టిన కవి గుర్రం జాషువా అని తెలుగు, సంస్కృత భాషల అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు శారదానికేతన్‌లో గురువారం జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షుడు ఎస్.బాల స్వామి అధ్యక్షతన జాషువా జయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథి విల్సన్ మాట్లాడు తూ సాహితీ లోకంలో విరాజిల్లిన కవిగా జాషువా వెలుగొందాడని కొని యాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంత వరకు జాషువా కవిత్వం వర్ధిల్లుతుందన్నారు.అనంతరం ప్రముఖ సాహితీవేత్తలు తుర్లపాటి రాధాకృష్ణ మూర్తి, చిటిపోలు వెంకటరత్నంను జాషువా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పోలే ముత్యం, పీవీ రమణ, బీరం సుందరరావు, డాక్టర్ ఎం.విజయశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, కరస్పాండెంట్ టి.శ్రీ నివాసరావు, న్యాయవాది రవీంద్రబాబు, మోహనరావు, కె.లెనినా, జె.బాబు రావు, చంద్రపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధిపై ఒప్పందం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్‌తో కాకినాడలోని యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగా ధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్ శివరాంప్ర సాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జి.అబ్బయ్య, సెక్రటరీ డాక్టర్ ఎ.శ్రీనివాస్, మెంటార్ డాక్టర్ కె. కృష్ణమోహన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సామాజిక బాధ్యతను సమాజంలోకి తీసుకెళ్లే విధంగా రెండు సంస్థలు పనిచేస్తాయన్నారు. ఎంఓయూ ద్వారా సంయుక్తంగా పలు సామాజిక అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు, సిబ్బంది డాక్టర్ వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పత్తి రైతులకు ప్రభుత్వం శుభవార్త

● ఎక్కడైనా పంట అమ్ముకునే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం శుభావార్త చెప్పింది. పత్తి పంటను ఇష్టమైన కొనుగోలు కేంద్రంలో అమ్ముకునే వెసులు బాటు కల్పిస్తూ జీఓ జారీ చేసింది. ఇప్పటి వరకు రైతులు పండించిన పత్తిని అదే మండలంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రాయించాల్సి వచ్చేది. దాని వల్ల సరైన ధర దక్కడం లేదని రైతులు ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం గత నిబంధనలను సవరించింది.

సాఫ్ట్‌వేర్ కోర్సులకి ఉచిత శిక్షణ

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో శాప్ ఎస్‌డీలో ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ అక్టోబర్ 25 ప్రారంభమవుతుం దని సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా ల్లోని డిగ్రీ విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 11వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంపై.. వివరాలకు 99852 22857, 94402 64695 నంబర్లకు సంప్రదించాలన్నారు. లేదా కుంచనపల్లి బైపాస్ రోడ్డు వద్ద డీ మార్ట్ పక్కన ఉన్న రామ్‌స్నేహ అవెన్యూస్ ఫ్లాట్ నంబరు 208లోని సంస్థ కార్యాల యంలో సంప్రదించవచ్చని సురేష్‌కుమార్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

32,470 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 30,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,470 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,696 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	14400
273	10500	13500	నెంబరు. 5	10000	14200
341	10000	15000	273	----	----
4884	----	----	341	10000	15200
సూపర్ 10	----	---	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14700
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	14800	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


13 గంటల పని విధానాన్ని విరమించుకోవాలి

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పనివిధానాన్ని విరమించుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురంలో ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల్లో ఈ విధానానికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

శక్తి స్వరూపిణీ.. నమోస్తుతే


చుట్టుగుంట పోలేరమ్మ తల్లి కాత్యాయనిదేవిగా..


కాత్యాయనిదేవిగా కనకదుర్గమ్మ దర్శనం


స్థానిక మల్లారెడ్డినగర్‌లో కాత్యాయనిగా అమ్మవారు


బృందావన్‌గార్డెన్స్‌లో అన్నపూర్ణదేవిగా..


అరండల్‌పేట అష్టలక్ష్మీ.. ధనలక్ష్మీ దేవిగా


పట్టాభిపురం ఆలయంలో భద్రకాళిగా అమ్మవారు

శ్రీదేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు గుంటూరు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజు గురువారం పలు దేవాలయాల్లో అమ్మవారిని కాత్యాయనిగా, ధనలక్ష్మిగా, రాజరాజేశ్వరిగా, కంచి కామక్షి దేవిగా, లలిత దేవిగా, మంగళ గౌరి దేవిగా అలంకరించారు. - గుంటూరు

ఆడిట్ రిపోర్ట్‌ల..

ఫైలింగ్ గడువు పొడిగింపు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వివిధ ఆడిట్ రిపోర్టుల ఫైలింగ్ సమయాన్ని పొడిగిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్(సీబీడీటీ) నిర్ణయం తీసుకుందని ప్రముఖ ఆడిటర్, ఏపీ రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 30 వరకు ఉన్న సమయాన్ని వచ్చే నెల అక్టోబరు 31 తేదీ వరకు పొడిగించినట్టు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమయాన్ని పొడిగించాలని అడిటర్ల అసోసియేషన్ తరుపున అనేక వినతి పత్రాలు సమర్పించగా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. సీబీడీటీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్‌టీ తగ్గింపు.. శ్లాబులతోనే విక్రయాలు

● సీటీ శాఖ గుంటూరు-1 జేసీ గీతామాధురి

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్‌టీ శ్లాబులతోనే విక్రయాలు జరపాలని వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు-1 జాయింట్ కమిషనర్ గీతామాధురి వ్యాపారులను కోరారు. జిన్నా టవర్ సెంటర్‌లోని వసుంధర కాంప్లెక్స్‌లోని ఆ శాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో గురువారం వ్యాపార వర్గాలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఇటీవల జీఎస్టీ శ్లాబులను నిత్యావసర సరుకులకు తగ్గించారని తెలిపారు. తగ్గిన ధరలు ప్రజలకు చేరువ చేసేలా వ్యాపారులు విక్రయాలు జరపాలని కోరారు. ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏపీ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి, నగేష్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

29న చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార వర్గాలకు ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికలు ఖాయమయ్యాయి. అధ్యక్ష, కార్యదర్శితో పాటు ఇతర పదవులకు రంగా బాలకృష్ణ వర్గం నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికలు తప్పనిసరియ్యాయి. గురువారం నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసింది. ఎవరూ నామినేషన్లను ఉప సంహరించుకోలేదు. ఇప్పటికే చాంబర్ అధ్యక్ష స్థానానికి బాలకృష్ణ, కార్యదర్శి పదవికి రంగా రామకృష్ణ, ఉపాధ్యక్షులు, ఈసీ సభ్యులుగా పది మంది వరకు నామినేషన్‌లు దాఖలు చేశారు.

● 29న ఎన్నికలు

ఈ నెల 29న గుంటూరు జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ భవనంలో ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల బాలకృష్ణ వర్గం నుంచి ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో.. ఇది తమ గెలుపునకు నిదర్శనమని ఏల్చూరి వర్గం ప్రచారం చేసుకుంటోంది. అయితే వ్యాపారులు ఏల్చూరి నాయకత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని, స్వచ్ఛందంగా తమ గెలుపునకు ఓటింగ్‌లో పాల్గొంటారని రంగా బాలకృష్ణ వర్గం చెబుతోంది. ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు 8 దశాబ్దాల చరిత్ర ఉంది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఈసీ సభ్యులు మొత్తం 48 మంది కార్యవర్గం. చాంబర్‌కు 70 వరకు అనుబంధ సంఘాలున్నాయి. ఇందులో 3 వేల మంది పైనే సభ్యులున్నారు. వారందరిని ఓటర్లుగానే పరిగణిస్తారు.

నేడు, రేపు భారీ వర్షాలు

● వాతావరణ శాఖ హెచ్చరిక ● అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్ర, శనివారాల్లో జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు వాతావరణ శాఖ హెచ్చరించింది. గాలులు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఐఎండీ హెచ్చరికలు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా డివిజనల్, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వర్షం నీరు డ్రెయిన్లలోకి ప్రవహించేలా చూడాలన్నారు. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. నీటి ప్రవాహాల వద్ద పిల్లలతో పాటు పెద్ద వాళ్ళు కూడా వెల్లకూడదని చెప్పారు. వాగులు ప్రవహించే ప్రదేశాల్లో వాహనదారులు వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించొద్దని విజ్ఞప్తి చేశారు. పశువులను కూడా బయటకు తీసుకెళ్లొద్దన్నారు. ఎలాంటి సాయం అవసరమైనా వెంటనే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకు 0863 2234014కి ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. మండల, డివిజనల్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ తగిన సమాచారాన్ని కలెక్టరేట్‌కు పంపాలన్నారు.

డయేరియా బాధితులకు మాజీ మంత్రి రజని పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రజని

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో డయేరియా బాధితులను మాజీ మంత్రి విడదల రజని గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా ఆమె విమర్శించారు. వైసీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, డైమండ్‌బాబు పాల్గొన్నారు.

ఉత్కంఠగా జాతీయస్థాయి చెస్ పోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయంలో 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం నాలుగో రౌండ్ ముగిసే సరికి ముగ్గురు గ్రాండ్ మాస్టర్లు, నలుగురు ఇంటర్నేషనల్ మాస్టర్లు చెరో నాలుగు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. టాప్ బోర్డులపై జీఎంలు, ఐఎంల మధ్య ఉత్కంఠ భరితమైన పోటీలు జరిగాయి. మాజీ ఆసియా చాంపియన్, రెండో సీడ్ జీఎం సూర్యశేఖర్ గంగూలీ, అలాగే భారత 2700 రేటింగ్ దాటిన రెండో ఆటగాడు జీఎం కృష్ణన్ సశికిరణ్ తమ ప్రతిభను చూపించారు. ఇంగ్లిష్ ఓపెనింగ్‌లో తమిళనాడు ఆటగాడు ఐఎం మనీష్ ఆంటో క్రిస్టియానో, బిషప్ త్యాగం చేసి ధైర్యంగా పోరాడినా, గంగూలీ ఎక్స్ఛేంజ్ సాక్రిఫైస్ తర్వాత రూక్ త్యాగంతో ఆధిపత్యం సాధించాడు. అదనపు బిషప్ ఆధిక్యం వల్ల గంగూలీ 46 మూవ్‌లలో గెలుపొందాడు. ఆంధ్ర ఆటగాడు జీఎం ఎం.ఆర్. లలిత్ బాబు ఫ్రెంచ్ డిఫెన్స్‌లో స్థిరమైన ఆట ఆడి అలేఖ్య ముఖర్జీపై విజయం సాధించాడు. 22వ మూవ్‌కి అన్ని పీసులు మారిపోవడంతో చివర్లో పాన్ ఎండ్‌గేమ్‌లో లలిత్ తన అనుభవంతో గెలిచాడు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం చంద్రమౌళీనగర్, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయం నేపథ్యంలో ప్రజలు సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి!

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి


చుట్టగుంట వాకింగ్ ట్రాక్ వద్ద ఊడుస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ వద్ద ప్రజలు, మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం ఆమె క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మీడియాతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 17న మొదలై అక్టోబర్ 2 వరకు ప్రతి రోజూ ప్రణాళికాబద్ధంగా స్వచ్ఛ భారత్- స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. 'ఏక్ దిన్- ఏక్ గంటా- ఏక్ సాత్' అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ కనీసం గంటసేపైనా పరిశుభ్రత కోసం కృషి చేయాలని కోరారు. ఆ బాధ్యత ఒక్క రోజు లేదా గంటకు పరిమితం కాకుండా ప్రతి రోజూ అలవాటుగా మారాలని సూచించారు. ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలకు స్టీల్ డబ్బాలు, బాటిళ్లను ఉపయోగించడం వంటి చిన్నచిన్న మార్పులు సమాజంపై గొప్ప ప్రభావం చూపుతాయని అన్నారు. శ్రమదాన కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛత క్రమశిక్షణను పెంపొందిస్తుంది

● ఏపీ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి


పాఠశాల ఆవరణ పరిశుభ్రతలో చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఉద్యోగులు

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అనేది వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితంలో క్రమశిక్షణను పెంపొందిస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏక్ దిన్ - ఏక్ గంట - ఏక్ సాత్ జాతీయ శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ బ్యాంక్ మెగా శుభ్రత కార్యక్రమాన్ని బ్రాడీపేటలోని ఎల్‌ఈఎం హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది బ్యాంకు సిబ్బంది హాజరై పాఠశాల ప్రాంగణాన్ని శుభ్ర పరిచారు. అదనంగా స్వల్ప మరమ్మతులు పనులు కూడా చేపట్టారు. పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు, ఇతర బ్యాంక్ అధికారులు హాజరయ్యారు.

రైల్వే ప్రాంగణాల్లో శ్రమదానం


నల్లపాడు రైల్‌విహార్‌లో చెత్తని తొలగించిన డీఆర్‌ఎం సుధేష్ణ సేన్, అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రైల్వే ప్రాంగణాల్లో గురువారం శ్రమదాన కార్యక్రమాలను అధికారులు, ఉద్యోగులు నిర్వహించారు. ఉదయం నల్లపాడులోని రైల్వే కాలనీలో డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ ఆధ్వర్యంలో చీపురు, పారలు చేతబట్టి వ్యర్థపదార్థాలన్ని తొలగించారు. రైల్ విహార్‌లో పడేసిన చెత్త, చెదారాన్ని తొలగించారు. మెకానికల్ విభాగం అధికారి మద్దాళి రవికిరణ్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వార్టర్స్‌లో శ్రమదానం నిర్వహించి డ్రెయిన్లు శుభ్రపరిచారు.

పరిసరాల శుభ్రత..ప్రజలందరి బాధ్యత

● సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వచ్ఛత మహోత్సవ్ ర్యాలీ


బ్యాంకు అధికారులు, ఉద్యోగుల అవగాహన ర్యాలీ

గుంటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరం పాలెంలో స్వచ్ఛత మహోత్సవ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంపాలెంలోని బొమ్మిడాల కాంప్లెక్స్‌లోని ఆదాయపు పన్ను భవన్‌లోని బ్యాంకు రీజనల్ కార్యాలయం నుంచి విజిలెన్స్, అవగాహన ర్యాలీ, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కడప రీజియన్ హెడ్ ఇ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ టీకే ప్రసాద్, రాకేష్ రంజన్, అంజనా, విజిలెన్స్ ఆఫీసర్ రాజన్‌కుమార్ తదితరులున్నారు.

ఆర్వీఆర్ జేసీలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్


విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య)సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న జాతీయస్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలకు ప్రాథమికంగా కళాశాల నుంచి 45 టీమ్‌లను సిద్ధం చేసినట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ వెల్లడించారు. విద్యార్థులు వ్యవసాయ, ఫుడ్ టెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత తదితర విభాగాల్లో తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ భాగాల అధిపతులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం


ఎస్పీ బాలసుబ్రహ్మణం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాయకులు, సేవా సదన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, తెలుగు పాటలకు చిరునామా ఎస్పీ బాల సుబ్రహ్మణ్యమని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సౌజన్యంతో, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపికుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్ సెంటర్, ఐలాండ్ వద్ద ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సభ నిర్వహించారు. తెలుగు భాష ఉన్నంత కాలం బాలు పాట వినపడుతూనే ఉంటుందన్నారు. బాలసుబ్రహ్మణ్యంను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయకులు యశోదకృష్ణ, వెంకటరత్నం, డేగల వెంకటేశ్వరరావు, ఖాదర్, బాబురావు, ఎన్ కోటేశ్వరరావు, కృపావరం, ఉపేందర్‌సింగ్, సత్తార్, మాతృశ్రీ విద్యాసంస్థల డైరక్టర్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ పూల్ ఉపాధ్యాయులకు..

పదోన్నతులు ఇవ్వాలి:ఏపీటీఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న బసవలింగారావు

గుంటూరు (విద్య) సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నిర్వహించిన 155 రోజుల్లోనే నియామకాలు చేపట్టడం హర్షణీయం అని, అయితే నూతన నియమకాల కన్నా ముందే డీఈఓ పూల్‌లో ఉన్న హిందీ, తెలుగు బాషా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కన్నావారి తోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యోగంలో చేరి దగ్గర నుంచి ఇప్పటి వరకు నిలకడగా ఉపాధ్యాయులు పనిచేయడం లేదన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ అర త గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పీఈటీ పదోన్నతుల్లో కూడా అన్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ నాయకులు పి.లక్ష్మీనారాయణ, జి.దాస్,ముని నాయక్, టి.రామారావు, పి.వేణుగోపాలరావు, కిరణ్, పశ్చల శివరామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి


జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సు, సంక్షేమం, సేవ కోసం దశాబ్దాల క్రితమే పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతాన్ని రూపొందించారని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో బీజేపీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ వీర్రాజు మాట్లాడుతూ పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయయ జన సంఘ్ పార్టీ సైద్ధాంతిక స్థంభంగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రధాని మోదీ అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం కార్యక్రమాలు రూపొందించి అమలుపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, వల్లూరు జయ ప్రకాష్ నారాయణ, దర్శనం శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, యడ్లపాటి స్వరూపారాణి, ఈదర శ్రీనివాసరెడి, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత ఫార్మసిస్టులదే



ర్యాలీలో ప్రసంగిస్తున్న డాక్టర్ సుందరాచారీ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో ఏపీ ఫార్మసిస్టుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. యాంటీ బయోటిక్ ఔషధ నిరోధకతపై ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత వైద్యులతో పాటు ఫార్మసిస్టులపై ఉందని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్ మందులు వాడటమే ఈ పరిస్థితికి కారణమని ఆయన వివరించారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఫార్మసిస్టులు వైద్య రంగంలో వెన్నెముక లాంటివారని కొనియాడారు. ప్రజల ఆరోగ్య అవసరాలకు ఎప్పుడు వారు తోడుగా ఉంటారని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు అందిస్తున్న సేవలు వెల కట్టలేవని తెలిపారు. అనంతరం నగర ప్రధాన కూడళ్లల్లో ఫార్మసిస్టులు ర్యాలీ నిర్వహించారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రుల సందర్భంగా శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, కేరళ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉచిత వైద్య శిబిరం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పంచకర్మ వైద్యనిపుణుల బృందం రోగులకు ఉచితంగా నాడీ పరీక్షలు చేసి... కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకాళ్ల అరుగుదల, ఆస్మా, ఎలర్జీ, అధిక బరువు, చర్మవ్యాధులు, సొరియాసిస్, పైల్స్, ఎయిడ్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు.

21 మినరల్ వాటర్ ప్లాంట్లు సీజ్

గుంటూరుకార్పొరేషన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలుషిత తాగు నీటిని సరఫరా చేస్తున్న 21 మినరల్ వాటర్ ప్లాంట్లను వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు సీజ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం తెలిపారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో కలుషిత తాగు నీరు, ఆహారం వల్ల డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు 120 మినరల్ వాటర్ ప్లాంట్ల నీటి శాంపిల్స్‌ను మంగళగిరిలోని ఐ.పి.ఎం పి.హెచ్ ల్యాబ్, గుంటూరు మెడికల్ కాలేజీ ఆవరణలోని రీజినల్ పి.హెచ్ ల్యాబొరేటరీ లో పరీక్షించినట్లు వెల్లడించారు. అందులో ఈ 21 ప్లాంట్ల నీటిలో హానికారిక బ్యాక్టీరియాను గుర్తించడం జరిగిందన్నారు. ల్యాబ్‌ల రిపోర్టులను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపడంతో.. కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

పానీపూరీ బంద్..!

గుంటూరులోని ప్రగతి నగర్, రామిరెడ్డి తోట, రెడ్ల బజార్, సంగడిగుంట సహా 9 ప్రాంతాల్లో డయేరియా వ్యాప్తి చెందడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు అప్రమత్తమయ్యారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పారిశుద్యం, తాగునీటి సౌకర్యంపై జాగ్రత్తలు సూచించారు. వ్యాధి మరింత ప్రబలకుండా తక్షణ చర్యగా నగరంలో టిఫిన్ బండ్లు, పానీపూరీ అమ్మకాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు.

తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు..
లారీ ఎక్కించి చంపేశాడు!

- మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఘాతుకం
- దాబా యజమాని సహా మరో వ్యక్తి మృతి
- శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఘటన


అయూబ్


దండాసి

కంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు ఓ డ్రైవర్ తన లారీని పైకి ఎక్కించి ఇద్దరిని చంపేశాడు! ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జలంత్రకోట సమీపంలోని దాబా హోటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్ ఖాన్ బుధవారం రాత్రి భోజనం చేసేందుకు దాబా హోటల్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటలకు భోజనం చేసి బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. దాబా యజమాని అయూబ్ (55) అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే డ్రైవరు మద్యం మత్తులో ఉన్నాడు. ఆ తర్వాత లారీ ఎక్కి నడుపుకుని వెళ్తుండగా.. ఆపేందుకు అయూబ్ ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని మీదుగా నడిపించడంతో అయూబ్ అక్కడికక్కడే చనిపోయారు. ఇది గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి (65) లారీని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అక్కడున్న వారు లారీని వెంబడించి బురగాం సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకు కేసు నమోదు చేశారు.

జల, థర్మల్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం

- జెన్కో ట్రాన్స్‌కో అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన గురువారం సచివాలయంలో ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ ఆధారపడకూడదని, వాటికి ప్రత్యామ్నాయంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జూలై నుంచి సగటున రోజుకి 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి జరుగుతోందని, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. అక్టోబరు నెలలో పండుగలు, వ్యవసాయానికి అనువైన కాలం కావడంతో, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ కోరారు. వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీ పృధ్వీతేజతో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎన్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభలో 'సినీ' రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

జగన్‌పై ధ్వజం... చిరంజీవి ప్రస్తావన

బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాసన సభ వేదికగా 'సినీ' రగడ రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్రంగా స్పందించారు. దీనికి ప్రతిస్పందనగా చిరంజీవి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉండగా సినీ ప్రముఖులను అవమానించారని... ఆయన వైఖరికి ఇదొక ఉదాహరణ అని కామినేని శ్రీనివాస్ గురువారం సభలో పేర్కొన్నారు. దీనిపై వారి వ్యాఖ్యలు, స్పందన, ప్రతిస్పందనలు ఇవి...

చిరంజీవి గట్టిగా అడిగితే...: కామినేని



జగన్మోహన్‌రెడ్డిది ఎంత సైకో మనస్తత్వమంటే.. చిరంజీవిని, ఆయన భార్య సురేఖను ఒకసారి రమ్మంటే వెళ్లినప్పుడు కారు పోర్టికోలోకి వెళ్లగానే జగన్ దంపతులు వచ్చి లోపలకు తీసుకెళ్లారు. తర్వాత సినిమా వాళ్ల సమస్యలపై చర్చించాలని అడిగితే ఆయనే (జగన్) జాబితా పంపారు. ఆ జాబితాలో బాలకృష్ణ, ఇతరులెవరూ లేరు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉంటున్న ప్రభాస్, మహేష్, రాజమౌళిని రమ్మన్నారు.. వాళ్లు రాబోమన్నా చిరంజీవి గారే రమ్మని అడగడంతో మొహమాటంతో వస్తే.. ఫస్ట్ షాక్. గేటు దగ్గరే కార్లు ఆపేశారు. అందరినీ కార్లు దిగి రమ్మన్నారు. అదేంటనుకుని కార్లు దిగి లోపలకు వెళ్లారు. లోపల సెకండ్ షాక్. ఇంత పెద్దవారిని పిలిచి అక్కడ పోసాని కృష్ణమురళి లాంటి వారిని కూర్చోబెట్టారు. తర్వాత మూడో షాక్. సీఎం గారు మిమ్మల్ని కలవట్లేదు.. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి మాట్లాడతారని అన్నారు అప్పుడు చిరంజీవి గారు కొద్దిగా గట్టిగానే.. అదేంటండి.. మీరు పిలిచారని నేను వీరందరినీ తీసుకొస్తే ఆయన రానంటారా.. అని అడిగారు. అప్పుడు జగన్ వచ్చారు. మీరొక తండ్రిలా సినిమా పరిశ్రమను జాగ్రత్తగా చూసుకోండని చిరంజీవి మంచిఉద్దేశంతో రిక్వెస్ట్ చేస్తే.. ఆ వీడియో బయటకు రిలీజ్ చేశారు. ఎంత అవమానం? శాడిస్ట్ మెంటాలిటీకి ఇంతకన్నా ఉదాహరణ ఏమి కావాలి?'

గట్టిగా ఎవరడిగారు: బాలకృష్ణ



అప్పుడు ఇండస్ట్రీ వాళ్లందరూ సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు ఈయన (జగన్) వచ్చాడు అన్నది అబద్ధం. అక్కడ గట్టిగా ఎవ్వడూ అడగలేదు.. సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారు.. ఆ వీడియో పెట్టడం, అవమానించడం నిజం. ఆయన (చిరు) ఏదో పెద్దగా చెబితే ఈయన (జగన్) దిగొచ్చాడంటా.. మొన్న కూడా నాకు ఇన్విటేషన్ వచ్చింది. ఇక్కడ ఫిల్మ్ డెవలప్మెంట్ జాబితా తయారు చేయమని! అందులో నాది తొమ్మిదో పేరు! మంత్రి కందుల దుర్గేశ్ గారిని అడిగా.. ఎవడు వాడు వేసిందని! మర్యాద ఇవ్వడం మానవత్వం. (కామినేని వైపు చూస్తూ..) అదేదో గట్టిగా.. ఎవడడిగాడు? గట్టిగా అడిగితే పంపించారా లోపలికి! ఆ రోజు గట్టిగా అడిగిన వారెవరూ లేరు. మీరు తెలీకుండా మాట్లాడుతున్నారు. అయితే ఆయన(చిరంజీవి)కు అవమానం జరిగింది వాస్తవమే. (స్పీకర్ వైపు చూస్తూ..) సారీ.. వివరణ ఇవ్వడమే నా ఉద్దేశం!'

బాలకృష్ణ అందుబాటులో లేరు: చిరంజీవి

'ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు చిత్రపరిశ్రమలోని కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిల్మ్ చాంబర్ ప్రతినిధులు నా దగ్గరకు వచ్చి, నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా టికెట్ల ధరల పెంపుదల గురించి ప్రభుత్వంతో మాట్లాడమని నన్ను కోరారు. వారిలో దర్శకులు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరోలు మహేశ్, ఎన్టీఆర్, నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ఉన్నారు. వారి సూచనల మేరకు అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. సీఎంతో చర్చించి చెబుతానని ఆయన చెప్పారు. ఆ తర్వాత మంత్రి నాకు ఫోను చేసి... జగన్ వన్ టు వన్ కలుస్తారని చెప్పి, లంచ్‌కి ఆహ్వానించారు. నేను సీఎం నివాసానికి వెళ్లగా ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించాను. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్ని నాని ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందు వల్ల ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పది మందిమి వస్తామని చెబితే సరేనన్నారు. ఆ సమయంలో బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలకృష్ణను కలవమని జెమిని కిరణ్‌ను పంపించాను. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఓ విమానం ఏర్పాటు చేసి ఆర్. నారాయణమూర్తితో సహా మరికొందరితో వెళ్లి సీఎంను కలిశాం. సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించి, ప్రభుత్వ సహకారం కోరాను. నేను చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అంగీకరించింది. ఆ నిర్ణయం వల్లే 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' వంటి సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. నేను సీఎంతోనైనా, సామాన్యుడితో అయినా నా సహజ ధోరణిలోనే మాట్లాడుతాను.'



పత్తి క్వింటా రూ.8,110

- వచ్చే నెల నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 4.02 లక్షల హెక్టార్లలో పత్తి పండించగా, 7.12 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలును సీసీఐ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తి క్వింటా రూ.8,110, మధ్యస్త పింజ పత్తి క్వింటా రూ.7,710 చొప్పున కొననున్నట్టు పేర్కొంది. సీసీఐ కొత్త నిబంధనల మేరకు ఎంపిక చేసిన మార్కెట్ యార్డులతో పాటు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆధార్ ఆధారిత ఈ-పంట డేటా ప్రకారం పత్తి రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి, రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనున్నారు. కాపాస్ కిసాన్ యాప్‌తో డేటా అనుసంధానం చేసి, స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. స్లాట్ బుకింగ్ నేపథ్యంలో మండలాల వారీగా పంట దిగుబడి, కోత సమయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. యార్డులు, మిల్లుల్లో పత్తి నిల్వలకు బీమా ఉండాలని నిర్దేశించింది. ప్లాస్టిక్, గన్నీ బ్యాగులను నివారించేందుకు రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించింది. పత్తి రైతుల కుటుంబ సభ్యులను గుర్తించేందుకు రేషన్‌కార్డులోని డేటాను సీఎంయాప్‌కు అనుసంధానం చేయాలని పౌర సరఫరాలశాఖను ఆదేశించింది. రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్‌కు సీసీఐ నగదు చెల్లింపులు జరపాలని నిర్దేశించింది. పత్తి అమ్మకం కోసం వివరాల నమోదు సమయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం ఫొటో కాపీలను రైతులు తీసుకు రావాలని స్పష్టం చేసింది. సాగు విస్తీర్ణం, దిగుబడి, పత్తితీతల మేరకు మండలాల వారీగా అమ్మకానికి రైతులను అనుమతించనున్నారు. పత్తి నాణ్యతాప్రమాణాలను రైతులకు వివరించాలని, అగ్ని నిరోధక, తేమ శాతం గుర్తింపు పరికరాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూనికలు, సీసీ కెమేరాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమేరాల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఐకి సూచించింది. పత్తి రవాణా వివరాలూ యాప్‌లో నమోదు చేసి, రవాణాదారులకు చెల్లింపులు జరపాలని పేర్కొంది. జిల్లా స్థాయిలో పత్తి కొనుగోలు కార్యకలాపాల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు సమస్యలపై నేడు సీఎంకు షర్మిల వినతిపత్రం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో 'రైతన్నకు అండగా కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతల ఆక్రందనలపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ నేతలతో చర్చించాక .. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళతామని తెలిపారు.

వరద జలాలపై మాకే సంపూర్ణ హక్కులు

- కృష్ణా ట్రైబ్యునల్ ముందు ఏపీ స్పష్టీకరణ
- వచ్చే నెల 29, 30, 31 తేదీల్లో కొనసాగనున్న వాదనలు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్ కేటాయించిన నికర జలాలతో పాటు వరద జలాలపైనా దిగువ రాష్ట్రంగా తమకే సంపూర్ణ హక్కులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు ప్రారంభించారు. ఎగువన ఉన్న తెలంగాణ నుంచి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చేశాక.. వాటిపై పూర్తి హక్కు తమకే ఉంటుందన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులూ ఉండబోవని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో తెలంగాణ వాదనలు వినిపించగా.. గురువారం ఏపీ వాదనలు ప్రారంభమయ్యాయి. తదుపరి విచారణ వచ్చే నెలాఖరుకు వాయిదాపడింది. అక్టోబరు 29, 30, 31 తేదీల్లో ఏపీ వాదనలు కొనసాగుతాయని ట్రైబ్యునల్ పేర్కొంది. కాగా.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో తమకు 70% వాటా ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.



ముగిసిన 'జల ప్రహార్' విన్యాసాలు

భారత ఆర్మీతో కలిసి నౌకాదళం ఏడాదికి రెండుసార్లు నిర్వహించే 'జల ప్రహార్' విన్యాసాలు విశాఖలో బుధవారం ముగిశాయి. వీటిని సముద్రంలోను, తీర ప్రాంతంలోనూ నిర్వహించారు. ఇందులో ఐఎన్ఎస్ ఘరియల్ పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఇక 'రెవెన్యూ' కష్టాలకు చెల్లు!

- వచ్చే నెలంతా ప్రణాళికా శాఖ ఇంటింటి సర్వే
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిక్షిప్తం
- నవంబరు నుంచి ఆర్టీజీఎస్‌కు అందజేత
- వాట్సాప్ గవర్నెన్స్ నుంచి ప్రజలు నేరుగా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ, నివాస, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోందని.. ప్రతి వారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్‌కు లంచం ఇస్తేనే పని చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాట్సాప్ గవర్నెన్స్ అమల్లోకి వచ్చాక మండల తహసీల్దారు కార్యాలయాలకు లబ్ధిదారులు, దరఖాస్తుదారులను రప్పించవద్దంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా కూడా రెవెన్యూ శాఖలో మార్పు రాలేదు. వారాంతపు సమీక్షా వివరాలను ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కుటుంబానికి సంబంధించిన సమస్త సమాచారం ఆర్టీజీఎస్ వద్ద ఉన్నందున వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా పుట్టుకతో వచ్చిన కులం మధ్యలో మారిపోదు కదా అని సీఎం పేర్కొన్నారు. ఆదాయానికీ ఇదే విధానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పత్రాలను నేరుగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి మౌఖికంగా సర్వే నిర్వహించిన ప్రణాళికా శాఖ అక్టోబరులో మరోసారి సర్వేకు సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు ఇంటింటి సర్వే చేసి ప్రధానమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను నిక్షిప్తం చేయనుంది. నవంబరు నుంచి వాటిని ఆర్టీజీఎస్‌కు అందజేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డేటాను క్రోడీకరించుకుని వారికి అవసరమైనప్పుడు ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని వాట్సాప్ గవర్నెన్స్ కల్పిస్తుందని 'ఆంధ్రజ్యోతి'కి కాటంనేని భాస్కర్ వివరించారు.

వేలకోట్లు వెచ్చిస్తున్నా
ఉద్దేశం నెరవేరట్లేదు!

- కేజీబీవీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- అర్హులైన బోధన సిబ్బంది లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్న
- 14న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి ఆదేశం
- రాష్ట్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి కూడా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 ఏళ్లుగా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కేజీబీవీల ఏర్పాటు ఉద్దేశం నెరవేరట్లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన కేజీబీవీలలో శాశ్వత ప్రాతిపదికన అర్హులైన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, అణగారినవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2004లో ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాలసీలో శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం గురించి ప్రస్తావించారని, మరోవైపు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారని పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడంలేదంది. ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని తెలిపింది. తగినన్ని అవకాశాలు ఇచ్చినప్పటికీ సరైన వివరాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంది. వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శిని, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. విచారణను వచ్చేనెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు) 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాలలో నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదిస్తూ.. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియామించుకొనే వెసులుబాటు కేంద్రం రూపొందించిన పాలసీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ...బోధన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి సూచనలు చేసిందన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో నడిచే విద్యాసంస్థలకు అయ్యే ఖర్చులో 60 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, కేంద్రం చెప్పినట్లు నడుచుకోకుంటే ఆ సొమ్మును విడుదల చేయరని తెలిపారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా



మలయాళ దర్శకుడు డాక్టర్ ప్రగబల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జాకీ'. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమకృష్ణ దాస్, సీ ప్రేమదాస్ నిర్మిస్తున్నారు. మధురైలో సంప్రదాయంగా కొనసాగుతున్న పొట్టేలు పందేల చుట్టూ సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రబృందం గురువారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రగబల్ మాట్లాడుతూ 'ఆసక్తికరమైన కథాంశంతో 'జాకీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. పొట్టేలు పందేలు, పాత్రల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. రియల్ లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తి బాలాజీ, సినిమాటోగ్రఫీ: ఉదయ్ కుమార్.

పవన్‌తో సినిమా ఆనందంగా ఉంది



- సుజీత్

'దాదాపు మూడేళ్ల ప్రయాణం. మొదటి రోజు నుంచి మమ్మల్ని సపోర్ట్ చేస్తూ, మా పక్కనే ఉంటూ మాకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసిన నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ గారికి కృతజ్ఞతలు. అలాగే 'ఓజీ' కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. నేను ఆయన వీరాభిమానిని. 'జానీ' సినిమా సమయం నుంచి పవన్‌గారిని కలిస్తే చాలు అనుకునేవాడిని. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు దర్శకుడు సుజీత్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'ఓజీ' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమైంది, విజయం సాధించిన తర్వాత భయం, బాధ్యత పెరిగాయి. 'ఓజీ' సినిమా మాది కాదు. దీన్ని ప్రేక్షకులు తమదిగా భావిస్తున్నారు. ఎక్కడ చూసినా 'ఓజీ' సందడే కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ గారికి ఉండే పవర్ అది. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, ఓజీ' ఇలా వరుసగా పవన్ కల్యాణ్ గారి సినిమాలకు పనిచేసే అవకాశం రావడం చిన్న విషయం కాదు' అని అన్నారు. డీవీవీ దానయ్య మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ గారి అభిమానులకు నచ్చే సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎంతో శ్రద్ధతో ఈ సినిమా చేశాం. తమన్, నవీన్ నూలి, రవి చంద్రన్ ముగ్గురూ ఈ సినిమాకు మూడు స్థంభాల్లాంటి వారు. అభిమానుల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

ఏఐతో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు



- ఢిల్లీ హైకోర్టులో నాగార్జున పిటిషన్
- వ్యక్తిగత హక్కులను కాపాడుతామన్న న్యాయస్థానం

కొన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాయని, పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ అక్కినేని నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిస్తోందని ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఆ పిటిషన్ జస్టిస్ తేజస్ కరియా సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నాగార్జున తరఫున న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 14 యూఆర్ఎస్ (యూనిఫాం రిసోర్స్ లొకేటరీ)లు కోర్టుకు సమర్పించారు. జస్టిస్ కరియా స్పందిస్తూ... 'మీ దగ్గర యూఆర్ఎల్ ఉన్నాయి కదా? ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు కదా?' అని ప్రశ్నించారు. తామిచ్చే ఆదేశాలతో ఎంత కాలం ఇలాంటివి ఆపగలమని వ్యాఖ్యానించారు. అలాగని, తామేమీ చూస్తూ ఊరుకోమని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఇంటర్నెట్‌లో భాగమైన తర్వాత పెద్ద సమస్యగా తయారైందని వ్యాఖ్యానించారు. నాగార్జున వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చూస్తామన్నారు. తక్షణమే ఆ లింకులను తొలగించాలని ఆయా యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.

-న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

జటాధర తొలి గీతం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓం నమఃశివాయ్..' అంటూ సాగే తొలి పాట సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేశారు. కాగా, ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆసక్తిగా 'గోదారి గట్టుపైన'



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా యూనిట్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. 'మనుషులు కూడా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా' అని సుమంత్ ప్రభాస్ పలికే సంభాషణలు ఆసక్తిగా ఉన్నాయి. కాగా, నిధి ప్రదీప్ ఈ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అవుతున్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి: ఎంపీటీసీ నాగేశ్వరరావు

పెదనందిపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వైద్యాధికారుల సూచనలు పాటించాలని ఎంపీటీసీ కల్లూరి నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని అన్నపర్రులో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీటీసీ కల్లూరి నాగు ప్రారంభించారు. వైద్యాధికారి ప్రియంవధ మహిళలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్లు చెన్నయ్య, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా, ఏఎన్‌ఎంలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులనీరు గురువారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 3,65,725 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1382, తూర్పుకాల్వకు 367, పశ్చిమ కాల్వకు 206, నిజాంపట్నం కాల్వకు 376, కొమ్మమూరు కాల్వకు 1818 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

ఇంటింటి సర్వే

ఫిరంగిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్ల పాలెం, కొత్తపేటలలో వైరల్ జ్వరాలు, ఖాళీ స్థలాల్లో ఉన్న నీటిని పంపటంపై సర్వే చేశామని సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధి కారి చంద్రశేఖర్ గురువారం తెలిపారు. గొల్లపాలెంలో తొట్లకు మూతలు బిగించాలని, రోళ్ళు, తొట్లలో ఉన్న నిల్వ ఉన్న నీటిని పార బోయించామని ఆయన తెలిపారు. దోమల నివారణకు ఎబెట్ మందును చల్లాలని ఈవోఏ కిషోర్‌బాబుకు ఆయన సూచించారు. కొత్తపేట కాలనీలోని స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని ప్రొక్లెయినర్‌ల ద్వారా కాలు వలకు పంపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ బాబూరావు, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్‌ఎం వేళాంగిణిరావు, ఆశాలు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా

పెదనందిపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. గురువారం విజ్ఞాన కేంద్రంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తరగతుల వల్ల క్రమశిక్షణ, జనరల్ నాలెడ్జ్ వంటివి పెంపొందించుకోవచ్చునని తెలిపారు. సెల్‌ఫోన్లు, సోషల్‌మీడియాలకు దూరంగా ఉండేందుకు ఈ తరగతులు దోహదపడతాయన్నారు. ఆటల పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

30లోగా ఈ-పంట నమోదుచేసుకోవాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఖరీఫ్ సీజన్ పంటలకు సంబంధించి, ఈ నెల 30వతేదీ లోగా 2025 ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో ఆర్. విజయబాబు కోరారు. మండలంలోని రేవేంద్రపాడు, మోరంపూడిలో వ్యవసాయ, ఉద్యాన పంటలను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలుసూచనలు చేశారు. ఏఈఈఈ ప్రజ్ఞాన్ బాబు, వీఏఏ బీసాయికృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

తుమ్మలపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పరిశీలన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తుమ్మలపాలెంలో గల సుప్రిమ్ ఎల్‌టీసీ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఈటీసీ బాపట్ల ట్రైనింగ్ సెంటర్ నుంచి మూడు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు పరిశీలించారు. ఈ షెడ్డులో చెత్త సేకరణ ఏ విధంగా చేస్తున్నారు.. ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ చేసే విధానం.. వర్మీ కంపోస్టు తయారీ చేయు విధానం వంటి విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో జోన్-3కి చెందిన ప్రకాశం, గుంటూరు, నెల్లూరు పూర్వ జిల్లాలకు చెందిన సుమారు 52 మంది ఎంపీడీవోలు ఈ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి తుమ్మలపాలెం సెక్రటరీ ఖాజాతో పాటు పారిశుధ్య కార్మికులు పూర్తి వివరాలను అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ టి.నాగమల్లేశ్వరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లపాడులో వైద్యశిబిరం

ఫిరంగిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్ర గుంట్లపాడు గ్రామంలో సర్పంచ్ తడవర్తి కేశవరావు ఉచిత వైద్య శిబి రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సీ యానీ గ్రేస్, సీహెచ్‌వో ఎస్ వెంకటలక్ష్మి, ఎంపీహెచ్‌ఎస్ కే సుదర్శనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే చిన్నమ్మాయి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి

తుళ్లూరు (ఐనవోలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఐనవోలు గ్రామంలో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి దండే కిషోర్, జిల్లా సెక్రటరీ ఎం.నరేంద్రబాబు, కొమ్మినేని సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.





మంగళగిరిలో కాశీఅన్నపూర్ణగా దుర్గానగర్ కనకదుర్గమ్మ, విజయలక్ష్మీ అలంకారంలో రాజ్యలక్ష్మీ, కాత్యాయనీదేవిగా కాళీమాత



దుగ్గిరాల శివాలయంలో శ్రీగాయత్రీదేవిగా అమ్మవారు



కేఆర్ కొండూరులో శ్రీభద్రకాళీదేవిగా అమ్మవారు

సకల వేద స్వరూపిణీ పాహిమాం

● కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
● వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పాతమంగళగిరి దుర్గానగర్‌లో శ్రీ కనకదుర్గమ్మ కాశీ అన్నపూర్ణగా, ఎర్రచెరువు వద్ద శ్రీ కాళీమాత అమ్మవారు కాత్యాయనీ దేవిగా, శివాలయంలో శ్రీభ్రమరాంబిక అమ్మవారు ధనలక్ష్మీగా, నృసింహాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు, ఘాట్‌రోడ్డులో శ్రీపద్మావతి అమ్మవారు విజయలక్ష్మీగా, మెయిన్ బజారులో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించారు.



ప్రత్తిపాడులో మంగళగౌరీ దేవి అలంకరణలో అమ్మవారు



కాత్యాయనీదేవిగా తుళ్లూరు గీతా మందిరం సెంటర్‌లో అమ్మవారు

● దుగ్గిరాల మండలంలోని పలుగ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల శ్రీగంగా పార్వతీ సమేత శ్రీనాగేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా.. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారు శ్రీభద్రకాళీదేవిగా దర్శనమిచ్చారు. పెనుమూలి, చింతలపూడి, చినపాలెం, ఈమని, పేరుకలపూడి, శృంగారపురం, పెదకొండూరు, పెదపాలెం, తుమ్మపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

● కాకుమానులో గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి ఆలయం, కొండపాటూరులోని స్వయంభు శ్రీపోలేరమ్మ తల్లి ఆలయం, అలాగే అప్పాపురంలో కొలువై ఉన్న శ్రీ భువనేశ్వరీదేవి ఆలయం, పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు. అప్పాపురంలో శ్రీభువనేశ్వరి దేవి ఆలయంలో సింహ వాహనంపై కాత్యాయనీ దేవిగా అమ్మవారు భక్తులను అలరించింది.

● పెదనందిపాడు: స్థానిక సోమేశ్వర స్వామి దేవస్థానంలో బాలత్రిపురసుందరీదేవి అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో, వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు ఖుష్మాండదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● ప్రత్తిపాడులోని సుప్రసిద్ధ వేణుగోపాలస్వామి దేవాలయంలో అమ్మవారు మంగళగౌరీ దేవిగా.. దండేశ్వరాలయంలో కాత్యాయనీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

● తుళ్లూరు : మండలంలోని దేవాలయాల్లో దసరా మహోత్సవ పూజలు జరుగుతున్నాయి. నిత్యం హోమాలు నిర్వహిస్తున్నారు. గురువారం తుళ్లూరు గీతా మందిరం సెంటర్లో ఏర్పాటు చేసిన అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సీతానగరం ఘాట్ వద్ద స్వచ్ఛ ఉత్సవ్ - 2025

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ- 2025 కార్యక్రమంలో భాగంగా గురువారం ఏక్ దిన్ - ఏక్ గంట - ఏక్ సాత్ అనే కార్యక్రమాన్ని స్వచ్ఛ ఉత్సవ్ - 2025 పేరిట ఎంటీఎంసీ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సీతానగరం పుష్కర ఘాట్ వద్ద ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది స్వచ్ఛంద సేవా సంస్థలు, పారిశుధ్య, మెప్మా సిబ్బంది, స్థానిక ప్రజలు నేతలు కలిసి ఘాట్‌లోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా అనే స్లోగన్ ఇచ్చి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, ఇట్టా భాస్కర్, అన్నెం కుసుమ, జనసేన నేత అంబటి తిరుపతిరావు, కేఎల్‌యూ విద్యా ర్థులు, పాఠశాలల విద్యార్థులు, టీచర్లు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



సీతానగరం ఘాట్ వద్ద పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న ఎంటీఎంసీ అధికారులు, స్థానికులు

● దుగ్గిరాల: దుగ్గిరాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. చిలువూరు ఎంపీపీ షేక్ జబీన్, పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించా రు. గ్రామపంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.వివేకానంద ఆధ్వ ర్యంలో పార్కును పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎల్‌పీవో స్వరూపరాణి మాట్లాడుతూ ఇంటిపరిసరాలు, ఇతర జన సంచార ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, యార్డు డైరెక్టర్ కొంగర జోగేంద్రప్రసాద్, టీడీపీ రాష్ట్రవాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: స్వచ్ఛ భారత్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యదర్శి శ్వేత అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ సెంటర్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు: స్వచ్ఛత గ్రామాల దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి పిలుపు నిచ్చారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కే రవిబాబు ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ ద్వారా శ్రమదానం గురువా రం చేశారు. అంతేగాక 113 తాళ్ళూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సీతారామయ్య ఆధ్వర్యంలో కార్యదర్శి వెంకటరావు తదితరులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి స్వర్ణలత, స్వచ్ఛాంధ్ర మండల అధికారి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, సొసైటీ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

● కాకుమాను: స్వచ్ఛభారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్. వెంకట లక్ష్మీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరులో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆమె తెలిపారు.

కాలువల్లో పూడికతీత

పెదనందిపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు ఎస్సీ కాలనీలో అదనపు పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో గురువారం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో ప్రజలు వ్యర్థాలు వేయరాదని, పారుదలకు ఆటంకం కలిగించరాదని, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.



ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

13 గంటల పని విధానాన్ని విరమించుకోవాలి

● ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పనివిధానాన్ని విరమించుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడే పల్లి మండలం కొలనుకొండ జాతీయ రహదారి వద్ద ఉన్న మోటూరు ఉదయం రైతుల రాష్ట్ర కార్యాలయంలో మహిళా సంఘం రాష్ట్ర స్థాయి ముఖ్యకార్యకర్తల విస్తృత సమావేశా న్ని గురువారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి అధ్యక్షతన నిర్వహించారు. రమా దేవి మాట్లాడుతూ 13 గంటల పనివిధానాన్ని ఐద్వా మహిళా సంఘం పూర్తిగా వ్యతిరేకి స్తుందన్నారు. అక్టోబరు 13 నుంచి 15వరకు అనంతపురంలో జరుగు అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహా సభల్లో 13 గంటల పనివిధానానికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్య క్షురాలు బి.ప్రభావతి, సహాయ కార్యదర్శులు శ్రీదేవి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, అలివేలు, పూర్ణ, రమణి, తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి పశు పోషణ లాభదాయకం

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ సుధాకర్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మేలు జాతి పశువుల పెంపకంతోపాటు సకాలంలో గేదెల పునరుత్పత్తిని చేయించటం ద్వారా పశుపోషణ లాభదాయకంగా చేయవచ్చని జిల్లా పశు గణాభి వృద్ధి సంస్థ అధికారి డాక్టర్ సుధాకర్ రైతులకు సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా లేమల్లెపాడు గ్రామంలో గురు వారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పాతూరి శివపార్వతి, స్థానిక ఎంపీటీసీ నగరాజ కుమారితో కలసి లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ సుధాకర్ రైతులను ఉద్దేశించి పశుపోషణ ఆవశ్యకత, పాడి పశువుల పెంపకంపై తీసుకో వాల్సిన చర్యలను ఆయన వివరించారు. పశు పోషకులు జాతి పశువు ల పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలని, అలాగే చలికాలంలో గేదెల పునరు త్పతి చేయించటం ద్వారా పశుపోషణను లాభదాయకంగా మార్చుకో వచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ ఎన్ శైలజ, డాక్టర్ ఏ సుచిత, డాక్టర్ కే లావన్య, వట్టిచెరుకూరు వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ సీహెచ్ హరీష్ కన్నాలు సుధాకర్‌తో పాటు గర్భోత్పత్తి పరీక్షలను పశువులకు నిర్వహించి వివిధ రకాల మందులను రైతులకు పంపి ణీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ముఖ్యమంత్రి సహా య నిధి కింద మంజూరురైన చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదా రులకు అందజేశారు. టిప్పర్ల బజారుకు చెందిన దాసరి షారన్‌కుమార్‌కు రూ.4.27 లక్ష లు, బాప్టిస్టుపేటకు చెందిన ముప్పన సతీశ్‌కు రూ.54,171, మార్కండేయ కాలనీకి చెందిన పఠాన్ షాహీనాకు రూ.28 వేలు, టిప్పర్ల బజారుకు చెందిన రాయపూడి వెంకటేశ్వరరావుకు రూ.51,980 చొప్పున మంజూరయ్యాయి. ఈ చెక్కులను టీడీపీ నేతలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పేదల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేష్, షేక్ రియాజ్, ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, నేతలు జం జనం వెంకట సుబ్బారావు, రాయపాటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న టీడీపీ నాయకులు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అరవింద హైస్కూల్ ఉపాధ్యాయులు

విద్యార్థుల జీవితానికి మార్గదర్శి ఉపాధ్యాయులు

● కేఎల్‌యూ ఎంబీఏ విభాగాధిపతి రమేష్‌బాబు

తాడేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితానికి మార్గదర్శి ఉపాధ్యాయులు అని కేఎల్‌యూ ఎంబీఏ విభాగాధిపతి రమేష్‌బాబు అన్నారు. గురువారం తాడేపల్లి మండలం కుంచనపల్లి అరవింద పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు కేఎల్‌యూలో నిర్వహించిన శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌బాబు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతోనే సమర్థవంతమైన విద్యార్థులు తయారవుతారన్నారు. ఉపాధ్యాయులంటే కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదని, విద్యార్థి జీవితానికి ప్రేరణశక్తిగా, విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపే శిల్పి అన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంవీ ఎల్ నరసింహారావు, కే అనూష, కార్యక్రమ కన్వీనర్ కిషోర్‌బాబు, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు ప్రసాద్ వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక 40వ డివిజన్, పెదపలకలూరు పీహెచ్‌సీ వద్ద జరిగిన ఏక్ దిన్- ఏక్ గంటా- ఏక్ సాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, మున్సిపల్ కార్మికులతో మాస్ క్లీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వీధులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● తహసీల్దార్ హేనాప్రియ

పెదనందిపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని తహసీల్దార్ హేనాప్రియ అన్నారు. మండలపరిధిలోని అన్నపర్రు, కొప్పర్రు గ్రామ సచివాలయాలను, రేషన్ దుకాణాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సచివాలయం, రేషన్ దుకాణాల్లో తప్పనిసరిగా స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ అబీద్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేనాప్రియ

ఘనంగా శ్రీగంగానమ్మ దేవతామూర్తి ప్రతిష్ఠ

దుగ్గిరాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిలువూరులోని శ్రీగంగా నమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా గురువారం నిర్వహించారు. 12 ఏళ్లుగా గ్రామంలో ఏటా మూడ్రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే గంగానమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలను ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తారు. బయోఫర్ ఫార్మాసంస్థ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సౌజన్యంతో కుటుంబసభ్యులతో కలిసి ఉత్సవాలు నిర్వహిస్తారు. గ్రామదేవతాల యాల్లో తొలిసారిగా రాతితో నిర్మాణం గావించి, వార్షికోత్సవ సందర్భంగా గంగానమ్మ దేవతా ఉత్సవమూర్తి ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జగదీష్ బాబు, సుభాషిణి దంపతులతోపాటు పలువురు దంపతులతో హోమం, పూర్ణా హుతి కార్యక్రమం నిర్వహించారు. రంగిశెట్టి రమేష్‌బాబు, వీరన్న దంపతులు, కృష్ణప్రసాద్, శైలజ, యేళ్ల జగదీశ్, దీపిక దంపతులు, గ్రామంలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



చిలువూరులో శ్రీగంగానమ్మదేవతా విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న దంపతులు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



మదర్సాలో చిన్నారులకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

కాకుమాను, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొమ్మూరులో మదర్సాలో విద్యార్థులకు దాత షేక్ ఇమామున్నిసా, సులేమాన్, నాగూర్‌లు దుప్పట్లు, చాపలు గురువారం అందించారు. బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ మదర్సాలో తల్లిదండ్రులు లేని చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారని వారికి దాతలు చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వలి, ముష్తీ, మజీద్ ఇజియా, ఖాన్ సైదా, ఖాశీం, బుడా, ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీటిని బయటకు పంపించాలి: మానస

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా ప్రత్తి పొలంలో ఉన్న అధికమైన నీటిని బయటకు పంపించి ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా పది నుంచి 15 కిలోల పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేయాలని కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటక్షన్ సహాయ అధికారి వై మానస తెలిపారు. గొట్టిపాడులో పత్తి పైరును వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేస్తూ పైరు ఎదుగుదలకు తీసుకోవలసిన చర్యలు, సూక్ష్మపోషకాల లోపం నివారణా మార్గాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో సుగుణ బేగం రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి

● ప్రొఫెసర్ వరలక్ష్మి

తాడికొండ (లాం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదు వుతోపాటు సృజనాత్మకంగా ఆలోచించాలని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజ్ విశ్రాంత రీడర్ ఇన్ ఇంగ్లిష్ ప్రొఫెసర్ బీ.వరలక్ష్మి తెలిపారు. లాం చల పతి ఫార్మసీ కళాశాలలో అసెస్మెంట్ 360 డిగ్రీస్, ఫార్మటివ్- సమ్మె టివ్ అసెస్మెంట్ మెకానిజమ్, బ్ల్యూప్రింటింగ్ అండ్ ఎడ్యూకేషన్ ఇన్ ఫార్మసీ అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్యతిథిగా హాజరైన వరలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకునే ప్రక్రియను అంచనా వేయడం కేవలం మార్కు లకే పరిమితం కాకుండా వారి ఆలోచనా విధానం మారాలన్నారు. సమస్య పరిష్కార నైపుణ్యం, వృత్తి పరమైన నైపుణ్యాలను అర్థం చేసుకునే విధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమం అనంతరం వరల్డ్ ఫార్మసీస్ట్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి

తెనాలి వార్తలు

• తెనాలి • పొన్నూరు

కొల్లిపర హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

● ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేసిన కాలనీవాసులు

కొల్లిపర, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర శివారు గుదిబండివారిపాలెం హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని గురువారం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. వర్షాలు పడినప్పుడు గృహాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని వెంటనే కాలనీలో రోడ్లు వేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, శ్రీలత, దుర్గారెహనా, పద్మ, యశోద, షేక్ బాషా, ఎం. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రహదారి శుభ్రతకు శ్రమదానం చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

టిడ్కో గృహ సముదాయంలో స్వచ్ఛతా హీ సేవ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని టిడ్కో గృహ సముదాయంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ ఇంటితోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు వ్యాప్తి చెందవని ఆమె చెప్పారు. రహదారుల వెంట ఖాళీ ప్రదేశాలలో పిచ్చిమొక్కలు లేకుండా పారిశుధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు, గుమ్మడి ప్రసాద్, అనుపమ, ప్రసాద్, నగర దీపికలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, వైద్యాధికారులు

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, కుటుంబ ప్రయోజనాల ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. నందులపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మహిళ ఆరోగ్యం కోసం దేశ వ్యాప్తంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు మొవ్వా యేసుబాబు, నిహారిక, మధుబాబు, రాహుల్, బాలయ్య, వినోద్‌బాబు, ప్రియాంక శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు అనంతాచార్యులు, సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ, ఉమాకాంత్, పుష్పలత, బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రపంచ ఫార్మసిస్టు డే

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టు డే నిర్వహించారు. విద్యార్థులు ఫార్మసిస్టు ప్రమాణం చేశారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ మాట్లాడుతూ, వైద్య వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. ఔషధాలవాడకంలో రోగులకు సరైన మార్గనిర్దేశం ఇచ్చే బాధ్యత ఫార్మసిస్టులపైనే ఉందన్నారు. భార్గవి, కోటిరెడ్డి, జ్యోతిబసు, కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు డిపాజిట్ వడ్డీ రేట్ల పెంపుదల

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో డిపాజిట్ వడ్డీ రేట్లను పెంచామని డిపాజిటర్లు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు కోరారు. టీబీ రోడ్డులోని బ్యాంకులో గురువారం పాలకవర్గ తొలి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. సీనియర్ సిటిజన్లకు 9.50 శాతం, సాధారణ వ్యక్తులకు 9 శాతం వడ్డీ ఇస్తామన్నారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.7200 రుణాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారి పున్నారావు, డైరెక్టర్లు, కార్యదర్శి పాల్గొన్నారు.

అక్టోబరు 10న గాలిగోపురం, కలశ ప్రతిష్ఠాపన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నాజరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిర్మించిన గాలిగోపురం కలశ ప్రతిష్ఠాపన అక్టోబరు 10న జరుగుతుందని చైర్మన్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఈ కార్యక్రమం శృంగేరీ విరూపాక్ష పీఠ పాలిత పరమ శివానంద భారతి చేతుల మీదుగా నిర్వహిస్తామని తెలిపారు.

పోషకాహారం పంపిణీ

చేబ్రోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేబ్రోలు ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. విజ్ఞాన్ కళాశాలలో ఫార్మసీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.కే.రాజ్యలక్ష్మి తన జన్మదినాన్ని పురస్కరించుకొని చేబ్రోలు మండలంలోని 25 మంది టీబీ బాధితులకు పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు వైద్యాధికారులు డాక్టర్. ఊర్మిళ, డాక్టర్ శైలజ, వేజండ్ల ఆరోగ్యకేంద్ర టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డా.రక్షిత్, సంగీతరావు, చేబ్రోలు ఎంపీహెచ్ఎస్ కృష్ణమోహన్, ఎస్‌టీఎస్ షేక్.చాందిని, ఎస్‌టీఎల్ఎస్ కే.మురళి తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపర: దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దీన దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని మండలంలోని వడ్డిముక్కలలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దీనదయాళ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీనదయాల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వద్రాణం ఉదయ్ చంద్రరావు, సీనియర్ నాయకులు కలపాల శ్రీనివాసరావు, తోట జనార్దన్‌రావు, యువమోర్చా నాయకులు ఆకాష్‌పవన్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆరె వెంకట్రావు ఆధ్వర్యంలో దీన దయాల్ జయంతి నిర్వహించారు.

● కొల్లిపర బీజేపీ కార్యాలయంలో గురువారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు లోకేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: రూరల్ మండలం సంగం జాగర్లమూడిలో గురువారం పండిట్ దీనదయాళ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కఠారి వాసుదేవనాయుడు మాట్లాడుతూ, జనసంఘ్ స్థాపనలోను, బీజేపీ ఆవిర్భావంలో ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. అలపర్తి రాఘవయ్య, నందకిషోర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు


తెనాలి: పాత శివాలయంలో భద్రకాళి అలంకారం..


దేవీచౌక్‌లో సంతానలక్ష్మి అలంకారం..


రామలింగేశ్వరపేటలో వైష్ణవిదేవి అలంకారం..


కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీకాత్యాయినీ దేవిగా అమ్మవారు


కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో శ్రీవారాహీదేవిగా..

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం ఇప్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో అమ్మవారిని లలితాత్రిపుర సుందరి దేవిగా అలంకరించగా గంగానమ్మపేట పాత శివాలయంలో భద్రకాళిగానూ, మారీసుపేట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగాను, దేవీచౌక్‌లో సంతానలక్ష్మీగా, ఓంకార ఆశ్రమంలో కాత్యాయినిదేవిగా, రామలింగేశ్వరపేటలో వైష్ణవిదేవిగా, శివాజీచౌక్‌లో లలితా త్రిపురసుందరిగా, ఎరుకలపూడిలో మహాగౌరిగా, నందివెలుగులో రాజరాజేశ్వరిదేవిగా అలంకారం గావించారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● పెదకాకాని: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారు గురువారం గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట శ్రీదశావతార వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో గురువారం అమ్మవారు ధనలక్ష్మీ అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు.


సంగం డెయిరీలో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వడ్లమూడి సంగం డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపంలో గురువారం చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలను వితరణ చేవారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం చండీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాత్యాయనీదేవిగా అమ్మవారు పూజలు అందుకుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు.

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారి అలంకారాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. గురువారం పట్టణ శివారులోని కనకదుర్గ భవాని ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తుల పూజలు అందుకుంది. పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయంలో కాశీవిశాలాక్షమ్మ కాత్యాయనీ దేవిగా పూజలు అందుకుంది. వాసవీ కన్యకా పరమేశ్వరి శ్రీతోటమ్మ సహస్ర లింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి నిడుబ్రోలు రాజరాజేశ్వరి దేవి, చింతలపూడి భ్రమరాంబ దేవి, కాత్యాయనీ దేవిగా పూజలందుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.

● కొల్లిపర మండలంలోని పలు దేవాలయాల్లో వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు పూజలు జరిపారు. కొల్లిపర శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీఅన్నపూర్ణాదేవి, శ్రీదేవి, భూదేవి శ్రీజనార్ధనస్వామి ఆలయంలో శ్రీవారాహీ దేవి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీకాత్యాయని దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చా రు. వల్లభాపురం, మున్నంగి, హనుమాన్‌పాలెం, తూములూరు, చివలూరు, అత్తోట శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.


ఏఎన్‌యూ: ధనలక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు..


పెదకాకాని: గాయత్రీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు..


శివాజీచౌక్‌లో లలితాత్రిపుర సుందరి దేవి అలంకారం...


పొన్నూరు: కాత్యాయినీ దేవిగా శ్రీకాశీ విశాలాక్షమ్మ..


పొన్నూరు: గాయత్రీదేవిగా కనకదుర్గ భవాని అమ్మవారు..

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

● వ్యవసాయాధికారి ప్రియదర్శిని

చేబ్రోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం నారాకోడూరులో గల ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా అనుమతి లేని ఎరువులు కానీ పురుగుమందులు కాని విక్రయించకూడదని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా మందుల విక్రయాలు జరిపితే సదరు దుకాణాలపై చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

భక్తి ప్రపత్తులతో పుణ్యతిథి ఉత్సవాలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సాయినగర్ శ్రీ షిరిడిసాయి మండపంలో గురువారం సాయి పుణ్యతిథి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం సాయి మండపంలో షిరిడి సాయిబాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశా. ఈ సందర్భంగా సాయినామ చాలీసా పారాయణం, మహిళలతో సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులతో ప్రజా ప్రతినిధులు

కొత్తరెడ్డిపాలెంలో 'స్వచ్ఛతా హీ సేవ'

చేబ్రోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తవేయడం వల్ల ప్రజా ఆరోగ్యానికి నష్టం ఏర్పడుతుందని ఎంపీడీవో టి.ఊహారాణి అన్నారు. చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఊహారాణి మాట్లాడుతూ తొలగించిన చెత్త కుప్పల స్థానంలో ప్రజలు తిరిగి చెత్త వేయకుండా దృష్టి పెట్టాలని పంచాయతీ సిబ్బందికి సుచించారు. స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, స్థానికుల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం రవిశంకర్, ఎంపీడీవో టి.ఊహారాణి, గ్రామ స్థులు, నాయకులు మోదుగుల సుబ్బారెడ్డి, వణుకూరి కొండారెడ్డి, గాదె సుబ్బారెడ్డి, సాంబయ్య పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం


ఏసుపాదం

చేబ్రోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న రావినూతల ఏసుపాదంకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవితో పాటు అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఏసుపాదంకు అభినందనలు తెలియజేశారు.

స్వచ్ఛ పొన్నూరుకు సహకారం

● మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామని మున్సిపల్ ప్రాంతీయ సంచాలకుడు సూర్యదేవర హరికృష్ణ అన్నారు. పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆర్‌డీ హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని డంపింగ్‌యార్డ్‌ను సందర్శించి చెత్త సెగ్రిగేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే నిడుబ్రోలు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు తనిఖీచేసి నీటి నాణ్యతను పరీక్షించారు. ప్రతిరోజు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణ వాసులు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


ఈద్గా వద్ద స్వచ్ఛతా హి సేవ ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ ఆర్డీ హరికృష్ణ తదితరులు

జీఎస్‌టీ తీసివేయడంతో పాలసీదారులకు ఊరట

కొల్లిపర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జీఎస్‌టీ తీసివేయడంతో ఎల్ఐసీ పాలసీదారులకు కొంత ఊరట కలిగిందని ఎస్ఐసీ తెనాలి బ్రాంచి సీనియర్ మేనేజర్ ఎంజీ బీమారావు అ న్నారు. గురువారం కొల్లిపరలో ఎల్ఐసీ ఎజెంట్లతో, పాలసీదారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీమారావు మాట్లాడుతూ తెనాలిలో ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం స్థాపించి 65 వసంతాలు సందర్భంగా అక్టోబరు 1వ తేదీన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అర్గనైజింగ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

● జీడీసీసీబీ మేనేజర్ బాజీబాబా

కొల్లిపర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తీసుకున్న రుణాలను రైతులు సక్రమంగా చెల్లించాలని జీడీసీసీ బ్యాంకు కొల్లిపర బ్రాంచి మేనేజర్ షేక్ బాజీబాబా అన్నారు. గురువారం కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర బ్రాంచి పరిధిలో ఇప్పటివరకు రైతులకు రూ.102కోట్ల వరకు వివిధ రూపాల్లో రుణాలు ఇచ్చారన్నారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు రూ.7కోట్ల 61లక్షలవరకు ఇచ్చారన్నారు. రైతులు రుణాన్ని సక్రమంగా చెల్లిస్తే అధికంగా రుణాలివ్వటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ టి.ప్రవీణ్, కార్యదర్శి శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీకి గతంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం ఏఎన్‌యూలో టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వం అండగా నిలిచింద న్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ సమన్వయకర్త ఎం వెంకటరమణ, టీఎన్ఎస్ఎఫ్ ఏఎన్‌యూ అధ్యక్షుడు విష్ణుప్రసాద్, రాధాకృష్ణ, విద్యార్థుల సంఘ నాయకులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

పెదకాకాని పీఏసీఎస్‌ను ప్రగతి పథంలో నడిపించాలి

● జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

పెదకాకాని, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పెదకాకాని పీఏసీఎస్‌ను ప్రతి పథంలో నడిపించాలని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికా ర్జునరావు తెలిపారు. గురువారం పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా మాకిరెడ్డి జయరామిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా తోట నారయ్య, తోట వెంకటరమణలను నియమించారు. ఈ సందర్భంగా చైర్మన్ జయరామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు కావలసిన అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదకాకాని పీఏసీఎస్ చైర్మన్‌గా జయరామిరెడ్డితో ప్రమాణం చేయిస్తున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన



వైసీపీ మహాపాపంపై ఎమ్మెల్సీ ఆలపాటి, టీడీపీ నేతల ప్రదర్శన

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి, కౌన్సిలర్లు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నిర్మాణం నిలిచిపోయిన భవనంలో పారిశుధ్యచర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. మున్సిపల్ కార్యాలయం వెనుక 2017లో రూ.10 కోట్లతో చేపట్టిన భవనం, సెల్లార్ మొదటి అంతస్తు పూర్తిచేసుకుని నిర్మాణం నిలిచిపోయింది. సెల్లార్‌లో అప్పటినుంచి కురుస్తున్న వర్షపు నీళ్లు, వ్యర్థాలు పేరుకుపోయి ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారింది. గురువారం టీడీపీ నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. ఆయనతోపాటు వచ్చిన కమిషనర్ శ్రీకాంత్‌కు సమస్య వివరించారు. మంత్రితో మాట్లాడి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. వారం రోజుల్లోగా సెల్లార్ నీటిని బయటకు తరలించి శుభ్రం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్లు దీనిపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, అశోకవర్ధన, ఈదర వెంకటపూర్ణచంద్, జొన్నాదుల మహేష్, సోపాటి కిరణ్, పాలడుగు సురేంద్ర, రమాదేవి, అర్బన్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, కౌన్సిలర్లు యుగంధర్, అనిత, బ్రహ్మేశ్వరరావు, త్రిమూర్తి పాల్గొన్నారు.

పరకామణి చోరీ చేసి వైసీపీ మహాపాపం మూటగట్టుకుంది..

తిరుమల ఆలయంలో పరకామణి చోరీకిపాల్పడి వైసీపీ మహాపాపం మూటగట్టుకుందని, దేవదేవునికి పంగనామాలు పెడదామని చూసిన ఆ పార్టీకి దేవుడే 11 సీట్లు ఇచ్చి పంగనామాలు పెట్టారని ఎమ్మెల్సీ ఆలపాటి పేర్కొన్నారు. పరకామణి చోరీపై స్థానిక మార్కెట్ వద్ద గురువారం ప్రదర్శన చేశారు. పింక్ డైమండ్‌పై ఎన్నో ఆరోపణలు చేసి తీరా అధికారంలోకి వచ్చాక వాటిపై నిలబడలేదని, దేనినైనా దోచేసే ఘనులు వైసీపీ నేతలని విమర్శించారు. టీటీడీ చైర్మన్, పాలన అధికారి, మాజీ సీఎం జగన్ ప్రోద్బలంతోనే చోరీకి పాల్పడిన విషయం ప్రజలు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు అవుతున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు గత ప్రభుత్వ పాపాలపై విచారణ చేస్తుంటే మళ్లీ వస్తాం అంతూ చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, వైసీపీ పాలనలోకి వచ్చేది లేదు, చేసేది లేదన్నారు.

డీఎస్సీ నియామకాలతో యువత కలలు సాకారం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలతో రాష్ట్రంలో నిరుద్యోగ యువత కలలు సాకారమయ్యాయని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ గురువారం అన్నారు. పొన్నూరు నియోజకవర్గం నుంచి 3 ఉద్యోగాలకు అర్హత సాధించి బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయినిగా నియమితులైన మారుపూడి శ్యామలను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర యువత డ్రీమ్ మెగా డీఎస్సీ అన్నారు. డీఎస్సీ పేరు చెప్పి ఐదేళ్లు అధికారం అనుభవించి వైసీపీ పాలకులు యువతను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగుల భవిష్యత్తును వారి ఆశలను జగన్‌రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే అమలు చేశారని కొనియాడారు. డీఎస్సీ విజేతల కళ్ళల్లో నిజమైన ఆనందాన్ని ప్రభుత్వంపై విశ్వాసాన్ని ప్రత్యక్షంగా చూసి సంతోషిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు.


డీఎస్సీలో ఉద్యోగం సాధించిన శ్యామలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

సచ్చిదానందమూర్తి ఆలోచనలు సమాజానికి మార్గదర్శకం

● వర్సిటీలో ఘనంగా జయంతి వేడుకలు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య కే సచ్చిదానందమూర్తి సూచించిన భారతీయ తాత్విక ఆలోచనలు ఆధునిక సమాజానికి మార్గదర్శకమని ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి కే.గంగాధర రావు వెల్లడించారు. ఏఎన్‌యూలోని ఆచార్య సచ్చిదానంద మూర్తి సెంటర్ ఫర్ ఆఫ్రో-ఏషియన్ ఫిలాసఫీ కేంద్రం సంచాలకుడు త్రిమూర్తి రావు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన కే.సచ్చిదానందమూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపకులపతి గంగాధరరావు, రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదిత రులు సచ్చిదానందమూర్తి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివా ళులర్పించారు. అనంతరం ఉపకులపతి గంగాధరరావు మాట్లాడుతూ ఆచార్య సచ్చిదానందమూర్తి పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చాయన్నారు. యువత ఆయన రచనల ద్వారా మానవతా దృక్పథా న్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ రవి కుమార్, పీజీ పరీక్షల సమన్వయకర్త సుబ్బారావు, సీడీసీ డీన్ వెంకటే శ్వర్లు, అశోక్‌కుమార్, రాధాకృష్ణతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సచ్చిదానందమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

దసరా ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల సందడి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల సందడి నెలకొంది. పట్టణంలోని పలు ఆలయాల ప్రాంగణాల్లో గురువారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భక్తి గీతాలాపనలు, బుర్రకథలు, హరికథాగానం, నాటికల ప్రదర్శనలతో కోలాహలం నెలకొంది. శివాజీచౌక్‌లో కూచిపూడి నృత్యగురువు చల్లా బాలత్రిపురసుందరిని మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి మనోహరం సత్కరించారు. కూచిపూడి నాట్యం, బాలికలు అద్భుతంగా ప్రదర్శించారు. ఉత్సవకమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, కార్యదర్శి యర్రు శ్రీనివాసరావు, మాదల కోటేశ్వరరావు, చల్లా గురునాథరావు పాల్గొన్నారు. బోసురోడ్డులని శ్రీవాసవీ ఆలయ ఆవరణలో శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆలపించిన భక్తిగీతాలు శ్రోతలను వీనులవిందు చేశాయి. గాయకులు కొండపి వసుంధర, మాజేటి వాసవిబృందం కీర్తనలు ఆలపించారు. దేవీచౌక్‌లో యువ ప్రతిభ కళాకారిణి అవార్డు గ్రహీత బాలత్రిపురసుందరి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. మారీసుపేట శివాలయంలో ఆంజనేయ శాస్త్ర శిష్యబృందం భక్తిరంజని నిర్వహించారు.


నృత్య గురువు బాలత్రిపురసుందరిని సత్కరిస్తున్న మంత్రి మనోహర్ సతీమణి మనోహరం

ప్రభుత్వం భూముల్లో నివాసితులకు పట్టాలు ఇవ్వాలి

పెదకాకాని, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని స్థానిక సుందరయ్య కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన గురువారం నిర్వహించారు. సీపీఎం గ్రామకార్యదర్శి బి.బాబురావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శివాజీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.